సాక్షి హనుమకొండ

ఆదివారం । 1 । డిసెంబర్ । 2024



ముందస్తు జాగ్రత్తే శ్రీరామరక్ష..
ఎయిడ్స్..నివారణ మార్గాలు తప్ప పూర్తిస్థాయి చికిత్స లేని వ్యాధి. ముందస్తు జాగ్రత్త తీసుకోవడమే నిండు జీవితానికి శ్రీరామరక్ష.
- 8లో▸



రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత
భారత రాజ్యాంగ పరిరక్షణ అందరి సమష్టి బాధ్యతని తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నగేశ్ తెలిపారు.
- 8లో▸

గరిష్టం/కనిష్టం
29^0 /23^0

వాతావరణం
జిల్లాలో ఉదయం ఆకాశం మేఘావృతమై ఉండి పలు అక్కడక్కడా చిరు జల్లులు కురిసే అవకాశం ఉంది. రాత్రి సమయంలో చలితోపాటు పొగ మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

దరఖాస్తుల ఆహ్వానం

న్యూశాయంపేట: క్రిస్మస్ వేడుకలు–24 సందర్భంగా ప్రభుత్వంచే గౌరవ సత్కారం పొందాలనుకునే అర్హులైన సంస్థలు, అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వరంగల్ జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి టి.రమేశ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సామాజిక సేవారంగం, విశిష్టమైన వైద్య సేవలు, విద్యాబోధన, సాహిత్యం, కళలు, క్రీడారంగాల్లో ప్రతిభ కనబరుస్తున్న సంస్థలు, వ్యక్తులు సత్కారం పొందేందుకు అర్హులని పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు తమ నామినేషన్ పత్రాలను నిర్ణీత నమూనాలో జిల్లా మైనార్టీ కార్యాలయంలో డిసెంబర్ 5లోగా అందించాలన్నారు. పూర్తి వివరాలకు 0870–2980533, 94901 51718 నంబర్లో సంప్రదించాలని సూచించారు.

కేయూ సోషియాలజీ విభాగాధిపతిగా స్వర్ణలత



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ సోషియాలజీ, సోషల్‌వర్క్ విభాగాధిపతిగా ఆ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ ఎం.స్వర్ణలతను నియమిస్తూ శనివారం కేయూ రిజిస్ట్రార్ ఆచార్య పి.మల్లారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఆవిభాగాధిపతిగా బాధ్యతలు నిర్వర్తించిన ప్రొఫెసర్ తాటం శ్రీనివాస్ ఉద్యోగ విరమణ పొందారు. ఆయన స్థానంలో స్వర్ణలతను నియమించారు. వీసీ ప్రతాప్‌రెడ్డి ఉత్తర్వులను స్వర్ణలతకు అందజేశారు.

వెసెక్టమీ ఆపరేషన్‌కు ముందుకు రావాలి



ఎంజీఎం: వెసెక్టమీ కుటుంబ నియంత్రణ ఆపరేషన్‌కు పురుషులు ముందుకు రావాలని హనుమకొండ డీఎంహెచ్‌ఓ అల్లెం అప్పయ్య అన్నారు. వెసెక్టమీ అవగాహన శస్త్రచికిత్సల పక్షోత్సవంలో భాగంగా శనివారం హనుమకొండలో ఆశా నోడల్ పర్సన్లతో నిర్వహించిన సమావేశంలో పీఓడీటీటీ డాక్టర్ కె.లలితాదేవి మాట్లాడుతూ.. ఆశనోడల్ అధికారులు తమ పరిధి ఆశాకార్యకర్తల పనిని పర్యవేక్షిస్తూ వారి నైపుణ్యాన్ని పెంచడానికి కృషి చేయాలన్నారు. సమావేశంలో జిల్లా మాస్ మీడియా అధికారి వి.అశోక్‌రెడ్డి, ఎస్‌ఓ ప్రసన్నకుమార్, హెచ్ఈఈఓ చంద్రశేఖర్, ఆశా నోడల్ అధికారులు పాల్గొన్నారు.

యూనిఫాం ధరిస్తున్నందుకు గర్వపడాలి



వరంగల్ క్రైం: ఉద్యోగంలో చేరిన పోలీసులు ఖాకీ యూనిఫాం ధరిస్తున్నందుకు గర్వపడాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా అన్నారు. తొమ్మిది నెలల పాటు శిక్షణ పూర్తి చేసుకుని బాధ్యతలు చేపట్టిన 578 మంది కానిస్టేబుళ్లతో కమిషనర్ అంబర్ కిశోర్‌ఝా శనివారం సమావేశమయ్యారు. ఈసందర్భంగా కానిస్టేబుళ్లలకు ఆయా పోలీస్ స్టేషన్లలో పోస్టింగ్ ఇస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో సెంట్రల్ జోన్‌పరిధిలో 145 మంది, వెస్ట్ జోన్ పరిధిలో 119 మంది, ఈస్ట్‌జోన్ పరిధిలో 68 మందితో పాటు మరో ఐదుగురు కానిస్టేబుళ్లను ఇతర విభాగాలకు కేటాయించారు. సమావేశంలో అదనపు డీసీపీలు రవి, సురేశ్‌కుమార్, ఏఓ రామకృష్ణ, ఏసీపీలు అనంతయ్య, ఆర్‌ఐలు స్పర్జన్‌రాజ్, శ్రీనివాస్, శ్రీధర్‌తో పాటు పరిపాలన సిబ్బంది పాల్గొన్నారు.

హృదయ క్షేత్రంలో జ్యోతులు వెలిగించండి



హన్మకొండ కల్చరల్: హృదయ క్షేత్రంలో పరమాత్మ అనే జ్యోతులు వెలిగించాలని, పరమాత్మ మన లోపలే ఉంటాడని తెలుసుకున్నప్పుడే మనిషి జన్మ సార్థకమవుతుందని పుష్పగిరి పీఠాధిపతి విద్యాశంకర భారతస్వామి ఉద్బోధించారు. వేయిస్తంభాల ఆలయాన్ని శనివారం ఆయన సందర్శించారు. ప్రదోషకాల పూజల్లో పాల్గొని రుద్రేశ్వర శివలింగానికి అభిషేకం, పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం భక్తులనుద్దేశించి అనుగ్రహభాషణం చేశారు. అనంతరం భద్రకాళి ఆలయంలో అమ్మవారికి పూజలు చేశారు.

చదువుకు పట్టాభిషేకం

అంబరాన్నంటిన నిట్ 22వ స్నాతకోత్సవం

- పట్టాలందుకున్న 1,600 మంది విద్యార్థులు
- 11 గోల్డ్ మెడల్స్.. పది మంది విద్యార్థులు
- విద్యార్థులు ఉత్తమ పౌరులు అవ్వాలి: నిట్ డైరెక్టర్
- హెల్త్ సెంటర్‌ను ప్రారంభించిన డీఆర్డీఓ చైర్మన్
- ఇన్‌స్టిట్యూట్, రోల్ ఆఫ్ హానర్ గోల్డ్ మెడల్ విన్నర్‌గా మంజిమా కర్మాకర్



మంజిమా కర్మాకర్‌కు రెండు బంగారు పతకాలు

స్నాతకోత్సవంలో 11 రోల్ ఆఫ్ గోల్డ్ మెడల్స్ పది మంది విద్యార్థులు అందుకున్నారు. ఇందులో ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ గోల్డ్‌మెడల్, రోల్‌ఆఫ్ హానర్ గోల్డ్‌మెడల్లను మంజిమా కర్మాకర్ అందుకోగా, పీజీ, పీహెచ్‌డీలతో పాటు మిగతా 7 డిపార్ట్‌మెంట్లలో విద్యార్థులు అందుకున్నారు.

కాజీపేట అర్బన్:

తెల్లటి కుర్తా పైజామా. మెడలో కండువా. తెలుగుదనం ఉట్టిపడేలా సంప్రదాయ దుస్తులు. అందరి ముఖాల్లో చిరునవ్వులు. వెరసి ఆకాశమే హద్దు అన్నట్లుగా వారి ముఖాల్లో ఆనందం వెల్లివిరిసింది. పట్టాలందుకున్న వేళ పట్టరాని ఆనందంతో ఎగిరి గంతేశారు నిట్ విద్యార్థులు. పిల్లల ఆనందాన్ని దగ్గరినుంచి చూసి ఉబ్బి తబ్బిబ్బైపోయారు తల్లిదండ్రులు. వరంగల్ నిట్‌లోని అంబేడ్కర్ లెర్నింగ్ సెంటర్ ఆడిటోరియంలో శనివారం నిట్ 22వ స్నాతకోత్సవం అంబరాన్నంటింది. ఇన్‌స్టిట్యూట్‌లో విద్యనభ్యసించి ఉత్తీర్ణత సాధించిన బీటెక్, ఎంటెక్, పీజీ, పీహెచ్‌డీకి చెందిన 1,875 మందిగాను 1,600 మంది విద్యార్థులు తెల్లటి కుర్తా పైజామా, శారీ, కాన్వొకేషన్ కండువా డ్రెస్ కోడ్‌లో సందడి చేశారు. కాన్వొకేషన్‌కు ముఖ్యఅతిథిగా సెక్రటరీ డైరెక్టరేట్ ఆఫ్ డిఫెన్స్(ఆర్ అండ్ డీ) డీఆర్డీఓ చైర్మన్ డాక్టర్ సమీర్ వి.కామత్ పాల్గొని విద్యార్థులకు పట్టాలు అందజేశారు. నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుధీ 22వ స్నాతకోత్సవానికి ప్రారంభ ఉపన్యాసం చేసి విద్యాసంస్థ విశిష్టత తెలియజేశారు. కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

10 పడకల హెల్త్ సెంటర్ ప్రారంభం..

నిట్ వరంగల్ క్యాంపస్‌లో 10 పడకల ఎమర్జెన్సీ వార్డు, ల్యాబ్, ఫిజియోథెరపీ అండ్ ఫార్మసీ బ్లాకలతో ఏర్పాటు చేసిన హెల్త్ సెంటర్‌ను డీఆర్డీఓ చైర్మన్ సమీర్ వి.కామత్ శనివారం ప్రారంభించారు.

పట్టాల కోసం క్యూ..

నిట్ 22వ స్నాతకోత్సవంలో 1,875 మంది విద్యార్థులు పట్టాలందుకోవాల్సి ఉండగా 1,600 మంది హాజరయ్యారు. ప్రతీ కాన్వొకేషన్‌ను ఆడిటోరియంలో ఏర్పాటు చేసే వారు, కానీ ఈసారి ఆడిటోరియం రినోవేషన్‌లో ఉండడంతో అంబేడ్కర్ లెర్నింగ్ సెంటర్ ఆడిటోరియంలో నిర్వహించారు. ఈ ఆడిటోరియంలో కేవలం 460 మందికి సరిపోతుండడంతో పట్టాలు అందుకునేందుకు విద్యార్థులు క్యూలైన్‌లో నిలబడాల్సి వచ్చింది.

రోల్ ఆఫ్ హానర్ గోల్డ్ మెడల్ విన్నర్స్ ఇలా..

- ఇన్‌స్టిట్యూట్ గోల్డ్ మెడల్ విన్నర్ – మంజిమా కర్మాకర్
- సివిల్ ఇంజనీరింగ్ – జగ్‌యాసీ నవీన్‌కమ్లేష్
- ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ – మంజిమా కర్మాకర్
- మెకానికల్ ఇంజనీరింగ్ – అనిమేష్ కుమార్
- ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ – కోడూరు శ్రీ చరణ్‌రెడ్డి
- మెటలర్జికల్ అండ్ మెటీరియల్స్ – ఎల్లా ప్రతీక్
- కెమికల్ ఇంజనీరింగ్ – శ్రీనివాస్ హేమన్ ధర్మవరం
- కంప్యూటర్ ఇంజనీరింగ్ – రాళ్లపల్లే కుమార్ చౌదరి
- బయోటెక్నాలజీ – సంతోశ్
- ఎంసీఏ – మనీషా వర్ష్నే
- పీహెచ్‌డీ–అరుణ్‌కుమార్

పట్టాలందుకున్న విద్యార్థులు ఇలా..

బీటెక్ -	949
ఎంటెక్ -	539
ఎంఎస్సీ-	154
ఎంబీఏ-	22
ఎంసీఏ-	55
పీహెచ్‌డీ-	147
ఇంటిగ్రేటెడ్ ఎగ్జిట్ పాలసీ -	09



పట్టాలు అందుకున్న ఆనందంలో విద్యార్థులు



మాట్లాడుతున్న డీఆర్డీఓ చైర్మన్ సమీర్ వి.కామత్

స్నాతకోత్సవం.. విద్యార్థుల స్వప్నం

బిద్యాధర్ సుబుధీ, నిట్ డైరెక్టర్



డిగ్రీ పట్టాను స్నాతకోత్సవంలో అందుకోవడం విద్యార్థి స్వప్నం. ప్రతీ విద్యార్థి ఉత్తమ పౌరుడిగా రాణించాలి. ప్రతీ ఏడాది బీటెక్, ఎంటెక్‌లకు మాత్రమే రోల్ ఆఫ్ హానర్స్ గోల్డ్‌మెడల్స్ అందజేస్తుండగా ఈ ఏడాది పరిశోధనలపై ఆసక్తిని పెంచేందుకు, గౌరవం కల్పించేందుకు పీహెచ్‌డీలో, అన్ని విభాగాల విద్యను ప్రోత్సహించేందుకు పీజీలో ఉత్తమ థీసీస్‌కు రోల్ ఆఫ్ హానర్ గోల్డెమెడల్‌ను ప్రారంభించాం. నిట్ వరంగల్ రూ.54.72 కోట్ల ప్రాజెక్టులు,4.19 కోట్ల కన్సల్టింగ్ గ్రాంట్లను సాధించింది. 300 కంపెనీలు ప్రతీ ఏడాది క్యాంపస్ సెలక్షన్స్‌లో మన విద్యార్థులను ఎంపిక చేసేందుకు పోటీ పడుతున్నాయి. ఈఏడాది రూ.88లక్షల వార్షిక ప్యాకేజీతో ప్రతిభ చాటారు. నిట్ అలూమ్ని సహకారంతో రూ.2.3 కోట్ల ఎండోమెంట్ ఫండ్‌ను సేకరించింది.

స్నాతకోత్సవం జరిగిందిలా..

- ఉదయం 10 గంటలకు : జాతీయ గీతాలాపన
- 10.05 : నిట్ డైరెక్టర్‌తో కాన్వొకేషన్ ప్రారంభోత్సవ డిక్లరేషన్
- 10.07 : ముఖ్య అతిథికి, విద్యార్థులకు స్వాగతం పలికిన నిట్ డైరెక్టర్
- 10.25 : ముఖ్య అతిథి ప్రసంగం
- 10.40 : డిగ్రీ పట్టాల ప్రదానోత్సవం
- మధ్యాహ్నం ఒంటిగంటకు : ముఖ్య అతిథి చేతులమీదుగా గోల్డ్‌మెడల్స్ అందజేత
- 1.10 : బీటెక్ విద్యార్థుల ప్రతిజ్ఞ
- 1.20 : ముఖ్య అతిథికి సన్మానం
- 1.38 : 22వ కాన్వొకేషన్ ముగింపు ప్రకటన
- 1.45 : జాతీయ గీతాలాపన

నా మొదటి బాస్ నిట్ విద్యార్థే

నేను పనిచేస్తున్న డీఆర్డీఓలో నా మొదటి బాస్ డాక్టర్ మానకొండయ్య నిట్ విద్యార్థే. ప్రపంచస్థాయిలో నిట్ విద్యార్థులు ప్రతిభ కనబరుస్తున్నారు. అలాంటి సంస్థలో చదవడం మీ అదృష్టం. దేశ నిర్మాణానికి పాటుపడాలి. 1958లో ఏర్పడిన డీఆర్డీఓ కేంద్ర రక్షణ మంత్రిత్వశాఖ ఆర్‌అండ్‌డీ విభాగం. దేశంలోనే సాంకేతికంగా అగ్రస్థానంలో ఉన్నాం. ఇందులో చేరేందుకు నిట్ విద్యార్థులు ఆసక్తిని కనబర్చాలి. దేశభవిష్యత్ యువత చేతుల్లోనే ఉంది.

- డాక్టర్ సమీర్ వి.కామత్, డీఆర్డీఓ చైర్మన్





ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు, పట్టా అందుకున్న కూతురుకు ముద్దుపెడుతున్న తల్లి

కేజీబీవీని తనిఖీ చేసిన ఎమ్మెల్యే కడియం



సరుకులను తనిఖీ చేస్తున్న ఎమ్మెల్యే శ్రీహరి

ధర్మసాగర్: మండలంలోని ముప్పారం శివారులో ఉన్న కేజీబీవీ పాఠశాలను స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి శనివారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు పెడుతున్న భోజనం, వంట సరుకులు, కూరగాయలు తనిఖీ చేసి శుచి, శుభ్రత తప్పనిసరిగా పాటించాలని, విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని సూచించారు. పాఠశాల పరిసరాలు, వంట గది, స్టోర్ రూమ్, తరగతి గదుల్ని పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పాఠశాల పరిసరాలతో పాటు విద్యార్థులు నిద్రించే గదులు, టాయిలెట్లు, వంటశాలల్లో పరిశుభ్రతకు అత్యధిక ప్రాధాన్యమివ్వాలని సూచించారు. విద్యార్థులకు వడ్డించే ఆహారం కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలని, శుద్ధి చేసిన నీటిని అందించాలని సూచించారు. పాఠశాలలో గీజర్‌కు మరమ్మతులు చేయించి స్నానానికి వేడి నీళ్లు అందించాలని అధికారులను ఆదేశించారు. మెయిన్ రోడ్డు నుంచి పాఠశాల వరకు సీసీ రోడ్డు, హైమాస్ట్ లైట్లు మంజూరైనట్లు త్వరలో పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అనిల్ కుమార్, కేజీబీవీ ఎస్‌ఓ మాధవి, నాయకులు ఎర్రబెల్లి శరత్, రొండి రాజు, వల్లపురెడ్డి రాంరెడ్డి, పెద్ది శ్రీనివాస్, రమేశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరకాలలో కేంద్ర బృందం పర్యటన



అభివృద్ధి పనులు పరిశీలిస్తున్న కేంద్ర బృందం

పరకాల: పరకాల మున్సిపాలిటీ పరిధిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న సంక్షేమ పథకాల అమలు, నిర్మాణ తీరును కేంద్ర బృందం శనివారం పరిశీలించింది. పరకాల పట్టణంలో నిర్మాణంలో ఉన్న శాఖాహార, మాంసాహార సమీకృత మార్కెట్‌ను, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధులతో సివిల్ ఆస్పత్రిలో నిర్మిస్తున్న వాటర్ ట్యాంకును, పశువుల సంత ఆవరణలో నిర్మాణం పూర్తి చేసుకున్న వాటర్ ట్యాంక్‌ను బృంద సభ్యులు పరిశీలించారు. చారిత్రాత్మక అమరధామాన్ని సందర్శించారు. అనంతరం అభివృద్ధి పనులపై మున్సిపల్ కమిషనర్ సుష్మ, మున్సిపల్ అధికారులతో సమీక్షించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఆంజనేయులు, అడిషనల్ డీఆర్డీఏ అధికారి శ్రీనివాసరావు, మున్సిపల్ ఏఈ రంజిత్, టీపీఎస్ ఖురేషి, ఎన్విరాన్‌మెంటల్ ఏఈ రోహిత్ తదితరులున్నారు.

జిల్లాలోని హాస్టళ్లలో పరిస్థితులేంటి?



మాట్లాడుతున్న విద్యా కమిషన్ సభ్యుడు విశ్వేశ్వర్‌రావు, పక్కన కలెక్టర్, అదనపు కలెక్టర్

- రాష్ట్ర విద్యా కమిషన్ సభ్యుడు విశ్వేశ్వర్‌రావు
- కలెక్టరేట్‌లో అధికారులతో సమావేశం

హన్మకొండ అర్బన్: 'మీ జిల్లాలో వసతి గృహాల పరిస్థితులు ఎలా ఉన్నాయి? వంట విషయంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటున్నారు? మరింత మెరుగ్గా చేయడానికి ప్రభుత్వం నుంచి ఏం సహకారం కావాలి' అని రాష్ట్ర విద్యా కమిషన్ సభ్యుడు విశ్వేశ్వర్‌రావు జిల్లా అధికారులను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలోని ప్రభుత్వ వసతి గృహాల పరిస్థితులు తెలుసుకునేందుకు ఆయన క్షేత్రస్థాయిలో పర్యటించారు. అనంతరం కలెక్టరేట్‌లో అధికారులతో సమావేశమై సలహాలు తీసుకున్నారు. కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. జిల్లాలో ఫుడ్ కమిటీల్లో విద్యార్థులను కూడా సభ్యులుగా చేర్చినట్లు తెలిపారు. అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, డీఈఓ వాసంతి, బీసీ సంక్షేమ అధికారి రాంరెడ్డి, జిల్లా సంక్షేమ అధికారి జయంతి, సాంఘిక సంక్షేమ అధికారి శ్రీలత, గిరిజన సంక్షేమాధికారి ప్రేమకళ ఉన్నారు.

ప్రభుత్వ మర్కజీ పాఠశాలలో..

విద్యారణ్యపురి: విద్యా కమిషన్ సభ్యుడు విశ్వేశ్వర్ రావు శనివారం హనుమకొండ ప్రభుత్వ మర్కజీ హైస్కూల్‌ను సందర్శించారు. ఈసందర్భంగా అన్నం ఒక్కోసారి ఉడకడం లేదని రసం అయితే నీళ్లలా ఉంటుందని, ఆలుగడ్డల కూర వండినప్పుడు వాటిపొట్టు తీయడం లేదని విద్యార్థులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఇదే విషయమై ఆయన హెచ్‌ఎంను ప్రశ్నించారు.

విద్యార్థులకు పౌష్టికాహారం అందించండి

కమలాపూర్: విద్యార్థులకు మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని రాష్ట్ర విద్యా కమిషన్



కూరను పరిశీలిస్తున్న విశ్వేశ్వర్‌రావు

సభ్యుడు ప్రొఫెసర్ పీఎల్.విశ్వేశ్వర్ రావు సూచించారు. శనివారం కమలాపూర్ మండలంలోని అంబాలలో 3వ అంగన్‌వాడీ కేంద్రాన్ని, కమలాపూర్‌లో కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని, మహాత్మా జ్యోతిబా పూలే బాలుర, బాలికల గురుకుల పాఠశాలలను ఆయన సందర్శించారు. ఆయా పాఠశాలల్లోని వసతులు, పరిసరాలు, విద్యార్థులకు అందుతున్న మధ్యాహ్న భోజనం, వంట సరుకులు పరిశీలించారు. కేజీబీవీ ఎస్‌ఓ అర్చన పాఠశాలలోకి పాములు వస్తున్నాయని ఆయన దృష్టికి తీసుకెళ్లగా పారిశుద్ధ్య పనులు చేయించాలని ఆదేశించారు. ఎంజేపీ బాలుర గురుకుల పాఠశాలలో భోజనం చాలా బాగుందని కితాబిచ్చారు. ఆయన వెంట డీఈఓ వాసంతి, బీసీ సంక్షేమ శాఖ డీడీ రాంరెడ్డి, ఐసీడీఎస్ జిల్లా అధికారి రమాదేవి, ఎంపీడీఓ బాబు, ఎంఈఓ రాంకిషన్‌రాజు, ఎంపీఓ రవి, కేజీబీవీ ఎస్వో అర్చన, ప్రిన్సిపాళ్లు డాక్టర్ టి.రవీందర్, సౌజన్య, వివిధ శాఖల అధికారులు తదితరులున్నారు.

విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీయాలి

- వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య
- ముగిసిన విద్యా, వైజ్ఞానిక ప్రదర్శన

విద్యారణ్యపురి: విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మక ప్రతిభను వెలికి తీయాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని.. విద్యార్థుల్లోని ఆలోచనలకు, నూతన ఆవిష్కరణలకు ఇలాంటి వేదికలు దోహదం చేస్తాయని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య అన్నారు. రెండు రోజులుగా జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఇన్‌స్పైర్, సైన్స్‌ఫేర్ విద్యా వైజ్ఞానిక బాలల ప్రదర్శనలు హనుమకొండలోని ప్రశాంత్‌నగర్‌లోని తేజస్వీ హైస్కూల్‌లో నిర్వహించారు. శనివారం సాయంత్రం ముగింపు సభలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థుల్లో ప్రతిభ దాగి ఉంటుందని.. పర్యావరణ హిత ఆవిష్కరణలు చేపట్టాలని పిలుపునిచ్చారు. జీవశాస్త్రం ఉపాధ్యాయుడి ప్రేరణతోనే తాను వైద్యురాలిని కాగలిగానని గుర్తు చేశారు. అడిషనల్ కలెక్టర్ వెంకటరెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు శాస్త్రీయ దృక్పథం పెంపొందించుకోవాలన్నారు. ఈసభకు అధ్యక్షత వహించిన డీఈఓ డి.వాసంతి మాట్లాడుతూ.. విద్యార్థులు సృజనాత్మకతను జోడించి నూతన ఆవిష్కరణలు చేయాలన్నారు. ఇన్‌స్పైర్, సైన్స్‌ఫేర్ ప్రదర్శనల్ని ఇతర పాఠశాలల విద్యార్థులు సైతం తిలకించారని తెలిపారు. కార్యక్రమంలో విజేతలకు ఎంపీ కడియం కావ్య, ఎస్‌బీఐ పరిశీలకులకు సుబ్రత్ కుమార్ ప్రశంసపత్రాలు, జ్ఞాపికల్ని అందజేశారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి ఎస్.శ్రీనివాసస్వామి, జిల్లా క్వాలిటీ కో–ఆర్డినేటర్ ఎ.శ్రీనివాస్, హనుమకొండ ఎంఈఓ విజయ్‌కుమార్, తేజస్వీ పాఠశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ పాల్గొన్నారు. ప్రభుత్వ మర్కజీ హైస్కూల్ ఉపాధ్యాయుడు వల్స పైడి వ్యాఖ్యాతగా వ్యవహరించారు. ఇదిలా ఉండగా.. ఇన్‌స్పైర్‌లో 120 మంది విద్యార్థులు తమ ప్రాజెక్టు ఎగ్జిబిట్లను ప్రదర్శించగా.. వారిలో 12 మందిని రాష్ట్రస్థాయికి ఎంపిక చేశారు. సైన్స్ ఫేర్‌లో 212 మంది విద్యార్థులకు గాను 15 మందిని ఎంపిక చేశారు. వివిధ మండలాల విద్యార్థులు మధ్యాహ్నం వరకు ఎగ్జిబిట్లను తిలకించారు. దీంతో అక్కడి వాతావరణం సందడిగా మారింది.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎంపీ డాక్టర్ కడియం కావ్య

కోర్టు కానిస్టేబుల్ వక్రబుద్ధి

- పట్టుబడిన గంజాయిని విక్రయిస్తున్న ఖాకీ

నర్సంపేట రూరల్: చేసేది కోర్టు కానిస్టేబుల్ ఉద్యోగం.. కానీ, వివిధ కేసుల్లో పట్టుబడిన గంజాయిని కోర్టుకు సమర్పించకుండా వక్రబుద్ధి ప్రదర్శించారు. అక్రమ మార్గంలో అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నాడు. ఆలస్యంగా వెలుగు చూసిన ఈ ఘటన వివరాలు నర్సంపేట సీఐ కథనం ప్రకారం.. నర్సంపేట మండలం గార్లగడ్డతండాకు చెందిన ఆంగోత్ రవి హనుమకొండ జిల్లాలోని ఎల్కతుర్తి పోలీస్ స్టేషన్‌లో కోర్టు కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. రవికి మేనల్లుడు అయిన మనోహర్, అతడి స్నేహితుడు అజీమ్ ఇద్దరు కలిసి ద్విచక్ర వాహనంపై వరంగల్ నుంచి నర్సంపేటకు గంజాయిని తరలిస్తున్నారు. పక్కా సమాచారం మేరకు గురువారం అర్ధరాత్రి మహేశ్వరం గ్రామ శివారులోని నర్సంపేట -వరంగల్ ప్రధాన రహదారిపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా ద్విచక్రవాహనంపై ఉన్న పెట్టెలో గంజాయి లభ్యమైంది. పోలీసులను చూసి అజీమ్ పారిపోగా మనోహర్‌ను అరెస్ట్ చేసి విచారించారు. ఈ గంజాయి ఎల్కతుర్తి పోలీస్‌స్టేషన్‌లో పని చేస్తున్న కోర్టు కానిస్టేబుల్ రవి ఇచ్చాడని తెలిపాడు. దీంతో వెంటనే రవిని అదుపులోకి తీసుకుని విచారించారు. కోర్టులో వివిధ కేసుల్లో అప్పగించే గంజాయిని తప్పించి వారితో పంపించినట్లు చెప్పాడు. దీంతో కోర్టు కానిస్టేబుల్ రవి, మనోహర్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదుచేసి విచారిస్తున్నట్లు సీఐ తెలిపారు.

నాణ్యమైన భోజనం పెట్టకపోతే బైఠాయిస్తా

మాజీ ఎమ్మెల్యే వెంకటరమణా రెడ్డి



శాయంపేట ఎంజేపీలో వండిన అన్నాన్ని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే గండ్ర

శాయంపేట: 'అన్నంలో పురుగులు.. బ్లీచింగ్ వాసన' శీర్షికన శనివారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి స్పందించారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. 80 మందికి పైగా విద్యార్థులు పాఠశాలలో ఉండగా.. కేవలం 20 మందికి మాత్రమే చట్నీ, కూరలు సరిపోతాయని.. విద్యార్థులకు సరిపడా కూరలు తయారు చేయాలన్నారు. అనంతరం 'భోజనం సరిగ్గా పెడుతున్నారా? చదువు బాగా చెబుతున్నారా?' అని పదో తరగతి విద్యార్థులను ప్రశ్నించారు. 'అన్నం బాగుండడం లేదని.. నీళ్ల కూరలు వండుతున్నారని అందుకే ఇంటి నుంచి టిఫిన్ బాక్స్‌లు తెచ్చుకుంటున్నాం' అని విద్యార్థులు సమాధానమిచ్చారు. ఇప్పటికైనా నిర్వాహకులు పద్ధతి మార్చుకోకపోతే విద్యార్థులతో కలిసి పాఠశాల ఎదుట బైఠాయిస్తామని హెచ్‌ఎం సారయ్యకు వివరించారు. ఏ సమస్య ఉన్నా తనకు ఫోన్ చేయాలని విద్యార్థులకు ఫోన్ నంబర్ ఇచ్చారు. అనంతరం మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబా పూలే బాలుర గురుకుల పాఠశాలను పరిశీలించి.. పాఠశాలలో టాయిలెట్ల డోర్లు సరిగ్గా లేవని, అన్నం మెత్తగా ఉండడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారన్నారు. మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంట మాజీ ఎంపీపీ మెతుకు తిరుపతిరెడ్డి, నాయకులు మారేపల్లి నందం, లక్ష్మారెడ్డి, రమణారెడ్డి, కరణ్‌బాబు, ఆదిరెడ్డి, మోహన్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అనుమానాస్పదస్థితిలో స్టాఫ్‌నర్సు మృతి

- మృతదేహంతో ఆస్పత్రి ఎదుట కుటుంబీకుల ఆందోళన



అప్సర(ఫైల్)


భూపాలపల్లి అర్బన్: జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రి స్టాఫ్‌నర్సు శనివారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. మృతురాలి కుటుంబీకుల కథనం ప్రకారం.. భూపాలపల్లిలోని టీటూ క్వార్టర్స్‌కు చెందిన ఎస్‌కే అప్సర (28) కొన్నేళ్ల క్రితం భర్తతో విడిపోయి తల్లిదండ్రులు వద్ద ఉంటోంది. జీవనోపాధి నిమిత్తం పట్టణంలోని బస్టాండ్ ఎదుట ఉన్న యోధ ఆస్పత్రిలో స్టాఫ్‌నర్సుగా పని చేస్తోంది. రోజుమాదిరిగానే శుక్రవారం రాత్రి విధులకు వెళ్లింది. ఈ క్రమంలో శనివారం ఉదయం ఆస్పత్రి సిబ్బంది ఒకరు అప్సర తండ్రికి సమాచారం ఇచ్చి ఆమె ఏదోలా చేస్తుందని, వెంటనే ఆస్పత్రికి వెళ్లామని చెప్పి మృతురాలి తండ్రిని తీసుకెళ్లారు. అక్కడకు వెళ్లి చూడగా అప్పటికే అప్సర శరీరం మొత్తం చల్లబడింది. వెంటనే యాజమాన్యం హనుమకొండకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. దీంతో ఆస్పత్రి యాజమాన్యం ఆమెను తన ఇంటి వద్ద దింపి వెళ్లిపోయింది. అయితే ఎలా మృతి చెందిందనే విషయంపై యాజమాన్యం చెప్పడంలో పొంతన లేకపోవడంపై కుటుంబీకులు అనుమానం వ్యక్తం చేశారు. ఆమె శరీర భాగంలో గాయాలై ఉన్నాయని, ఆస్పత్రిలోనే ఏదో జరిగి ఉంటుందని కన్నీరుమున్నీరయ్యారు. ఆస్పత్రి యాజమాన్యమే బాధ్యత వహించాలని, తమకు న్యాయం చేయాలంటూ వేడుకున్నారు. అనంతరం ఆస్పత్రి ఎదుట మృతదేహంతో ఆందోళన చేపట్టారు. ఈ విషయం తెలుసుకున్న ఎస్సై సుధాకర్ సిబ్బందితో కలిసి ఆస్పత్రికి చేరుకున్నారు. కుటుంబీకులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. మృతదేహానికి పోస్టుమార్టం చేయిస్తే నిజం తెలుస్తుందని కుటుంబీకులకు సర్దిచెప్పారు. సంబంధిత ఆసుపత్రి డాక్టర్‌తో మాట్లాడించి ఆందోళనను విరమింపజేశారు.

ముందస్తు జాగ్రత్తే శ్రీరామరక్ష..

మందులేని మాయరోగం ఎయిడ్స్
- ఉమ్మడి వరంగల్ జిల్లాలో పెరుగుతున్న హెచ్‌ఐవీ కేసులు
- చాపకింద నీరులా వ్యాప్తి చెందుతున్న మహమ్మారి
- ఆందోళన కలిగిస్తున్న కేసుల సంఖ్య
- నేడు ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవం

ఎయిడ్స్.. నివారణ మార్గాలు తప్ప పూర్తిస్థాయి చికిత్స లేని వ్యాధి. అవగాహనే ఎయిడ్స్ నియంత్రణకు సరైన మందు. ముందస్తు జాగ్రత్త తీసుకోవడమే నిండు జీవితానికి శ్రీరామరక్ష. ప్రస్తుతం హెచ్‌ఐవీ, ఎయిడ్స్ మహమ్మారి దీర్ఘకాలిక అనారోగ్య సమస్యగా మారింది.వ్యాధి వ్యాప్తిని నిరోధించడం, చికిత్స అందించడం, స్వచ్ఛంద సంస్థలు, అధికారులు ప్రజలకు అవగాహన కలిస్తున్నప్పటికీ ఉమ్మడి వరంగల్ జిల్లాలో కేసుల నమోదు తీరు ఆందోళన కలిగిస్తుంది. డిసెంబర్ 1వ తేదీ ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవం. ఈ సందర్భంగా 'సాక్షి' ప్రత్యేక కథనం.

-సాక్షి, వరంగల్/జనగామ/నెహ్రూసెంటర్



అవగాహనే సరైన మందు..

హెచ్‌ఐవీ అని తెలియగానే సీడీ–4 కణాల సంఖ్య తగ్గేంత వరకూ అశ్రద్ధ చేయకుండా వైద్యుల పర్యవేక్షణలో ఆధునిక వైద్యసేవలు పొందితే 75 ఏళ్ల వరకు ఆరోగ్యంగా జీవనం సాగించొచ్చు. ఎయిడ్స్ రోగులూ మధుమేహం, బీపీ, ఆస్తమా రోగుల మాదిరిగానే ఔషధాల వాడకం ద్వారా మంచి ఆరోగ్యం పొందొచ్చు. హెచ్‌ఐవీ ఉన్న దంపతులు తగిన సమయంలో ఏఆర్‌టీ మందులు వాడి ఆ రోగం లేని పిల్లలకు జన్మనివ్వొచ్చు. అవగాహనే ఎయిడ్స్ నియంత్రణకు సరైన మందు. సురక్షిత లైంగిక సంపర్కం, కండోమ్‌ల వాడకం ద్వారా దీనిని అడ్డుకోవచ్చు.



ఏయే ఆహారం తీసుకోవాలి..

హెచ్‌ఐవీ బాధితులు ఉదయం 3 కిలోమీటర్లు నడవడం, 15 నిమిషాల పాటు ధ్యానం చేయాలి. గ్లాస్ పాలు, బ్రెడ్, ఉడికించిన గుడ్డు తీసుకోవాలి. రోజు రాగి జావా, అంబలి తాగాలి. మధ్యాహ్నం భోజనంలో తాజా కూరగాయలు, ఆలు దుంపలు, ఆకు కూరలు, పప్పు దినుసులు, కోడి, మేక, చేప మాసం తీసుకోవాలి. సాయంత్రం సమయంలో ఆపిల్, దానిమ్మ, అంగూర, అరటి పండ్లు, పైనాపిల్, సపోట తినాలి. గోధుమ రవ్వ పాలలో కలిపి ఉడికించి ఆరగించాలి. రాత్రి భోజనంలో తాజా కూరగాయలు, రెండు చపాతీలు, నిద్రించే సమయంలో వేడి చేసి చల్లార్చిన నీరు తాగిలి. హెచ్‌ఐవీ బాధితులు రోగ నిరోధక శక్తి పెంపొందించుకోవడం ద్వారా జీవితకాలాన్ని పెంచుకోవచ్చు.

తల్లి నుంచి బిడ్డకు హెచ్‌ఐవీ సోకే ప్రమాదం..

తల్లి గర్భంలో ఉన్న సమయంలో 5 నుంచి 10శాతం, కాన్పు సమయంలో 15 నుంచి 20 శాతం, బిడ్డకు తల్లి పాలు ఇచ్చే సమయంలో 5 నుంచి 10 శాతం వచ్చే అవకాశం ఉంటుంది.

గర్భిణులకు సైతం..

హనుమకొండ జిల్లాలో ప్రతి నెలా కొత్తగా ఐదు హెచ్‌ఐవీ కేసులు నమోదవుతున్నాయి. వీరిలో ఒకరు గర్భిణీ ఉండడం ఆందోళన కలిగిస్తోంది. అయితే 2023–24లో 31,205 మందికి హెచ్‌ఐవీ పరీక్షలు చేయగా 86 మందికి హెచ్‌ఐవీ ఉన్నట్లు నిర్ధారించారు. 2024 ఏప్రిల్ నుంచి అక్టోబర్ వరకు 17,218 మందికి పరీక్షలు చేస్తే 37 మందికి హెచ్‌ఐవీ ఉన్నట్లు తేలింది. 9,049 మంది గర్భిణులకు పరీక్షలు చేస్తే తొమ్మిది మందికి హెచ్‌ఐవీ ఉన్నట్లు నిర్ధారణ అయింది. కాగా, తెలంగాణ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ.. టీబీ ఆస్పత్రికి సంపూర్ణ సురక్ష కేంద్రాన్ని మంజూరు చేసింది.

హైరిస్క్‌లో 6,388 మంది బాధితులు..

వరంగల్ జిల్లాలో 3,498, హనుమకొండ జిల్లాలో 2,890 మంది హైరిస్క్‌లో ఉన్నారు. వరంగల్ జిల్లాలో ఫిమేల్ సెక్స్ వర్కర్లు 2,269 మంది, స్వలింగ సంపర్కులు 1,112, ట్రాన్స్ జెండర్లు 117 మంది ఉండగా, హనుమకొండ జిల్లాలో మహిళా సెక్స్ వర్కర్లు 2,103, స్వలింగ సంపర్కులు 784, ట్రాన్స్ జెండర్లు ముగ్గురు ఉన్నారు. 2001 నుంచి హెచ్ ఐవీ పరీక్షలు జరుగుతుండగా వరంగల్ లో యాంటీ రిట్రోవైరల్ థెరపీ (ఏఆర్‌టీ) సెంటర్ లో 5,314 మంది, హనుమకొండలోని ఏఆర్‌టీ సెంటర్‌లో 5,235 మంది పేర్లు నమోదుచేసుకున్నారు. ఈ రెండు జిల్లాలో 4,585 మందికి ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నారు. అలాగే 1671 మందికి ప్రతినెల రూ.2,016 ఏఆర్‌టీ పెన్షన్ అందుతోంది.

మహబూబాబాద్ జిల్లాలో హెచ్‌ఐవీ బాధితులు..

మహబూబాబాద్ జిల్లాలో హెచ్‌ఐవీ కేసుల పెరుగుదల ఆందోళన కలిగిస్తోంది. 25 సంవత్సరాల నుంచి 40 సంవత్సరాల వయస్సు గల వారు ఈ వ్యాధికి గురవుతున్నట్లు అధికారులు తెలుపుతున్నారు. రెండు సంవత్సరాలుగా కేసుల సంఖ్య పెరుగుతూ వచ్చింది.

వరంగల్ జిల్లాలో ఆరు నెలల్లో 262 మందికి...

వరంగల్ జిల్లాలో ప్రతినెలా కొత్తగా 37 హెచ్‌ఐవీ కేసులు నమోదవుతున్నాయి. వీరిలో ఒకరు గర్భిణీ ఉండడం ఆందోళన కలిగిస్తోంది. అయితే 2023–24లో 31,688 మందికి పరీక్షలు చేయగా 493 మందికి హెచ్‌ఐవీ అని నిర్ధారణ అయ్యింది. 2024 ఏప్రిల్ నుంచి అక్టోబర్ వరకు 19,900 మందికి పరీక్షలు చేస్తే 262 మందికి ఉన్నట్లు నిర్ధారణ అయ్యింది. 11,120 మంది గర్భిణులకు పరీక్షలు చేస్తే ముగ్గురికి హెచ్‌ఐవీ అని నిర్ధారణ అయ్యింది.

మానుకోట జిల్లాలో నమోదైన కేసుల వివరాలు

సంవత్సరం	కేసులు
2021-22,	68
2022-2023,	89
2023-2024,	102

జనగామ జిల్లాలో ..

సంవత్సరం	కేసులు
2019-20	89
2020-21	67
2021-22	59
2022-23	62
2023-24.	79

హెచ్‌ఐవీ బాధితులకు మెరుగైన వైద్య పరీక్షలు



హెచ్‌ఐవీ బాధితులకు ఏఆర్‌టీ సెంటర్ ద్వారా మెరుగైన వైద్య పరీక్షలు అందిస్తున్నాం. బాధితులపై ఎవరూ వివక్ష చూపించొద్దు. ఆస్పత్రికి వచ్చిన సమయంలో సర్వీసు ప్రొవైడర్లు, సామాన్య ప్రజలు వారితో స్నేహభావంతో మెలగాలి. ఎయిడ్ నిర్మూలకు పట్టణం నుంచి పల్లె వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

మల్లికార్జునరావు,డీఎంహెచ్‌ఓ, జనగామ

ఇస్రో స్పేస్ ట్యూటర్‌గా శశాంక్



శశాంక్

విద్యారణ్యపురి: హనుమకొండకు చెందిన యువ ఆర్కిటెక్ శశాంక్ భూపతిని తెలంగాణ రాష్ట్రం నుంచి ఏకైక స్పేస్ ట్యూటర్‌గా ఇస్రో ఎంపిక చేసింది. శశాంక్ వరంగల్ జిల్లా కోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్న శంకర్, శ్యామల కుమారుడు. శశాంక్ జేఎన్టీయూ నుంచి 2002లో ఆర్కిటెక్ కోర్సు పూర్తిచేశారు. ప్రస్తుతం స్పేస్ ఆర్కిటెక్చర్ సబ్జెక్టును స్పెషలైజేషన్‌గా ఎంపిక చేసుకుని పరిశోధనలు చేస్తున్నారు. 2022లో 'ఏన్షియంట్ టెక్నాలజీ డిజైన్ రీసెర్చ్ ల్యాబ్' అనే కంపెనీని స్థాపించారు. ఆ కంపెనీ ద్వారా గృహ, ఇతర నిర్మాణాల డిజైన్లు రూపొందిస్తున్నాడు. ఈ క్రమంలో ప్రధాని మోదీ.. అంతరిక్ష పరిశోధనల కోసం విద్యార్థుల్లో అవగాహన పెంచేందుకుగాను స్పేస్‌ట్యూటర్లను నియమించుకునే బాధ్యత ఇస్రోకు అప్పగించారు. శశాంక్ భూపతి ప్రాజెక్టులు నచ్చిన ఇస్రో.. ఆయనను స్పేస్‌ట్యూటర్‌గానియమిస్తూ నవంబర్ 29న ఉత్తర్వులు జారీచేసింది. దీంతో ఇస్రో సహకారంతో విద్యార్థులకు సదస్సులు నిర్వహించబోతున్నట్లు శశాంక్ భూపతి శనివారం వెల్లడించారు.

ఆడుకుంటూ వెళ్లి అనంతలోకాలకు..

- నీటి గోలెంలో పడి చిన్నారి మృతి
- యశ్వంతాపూర్‌లో ఘటన



ఖుషి (ఫైల్)

జనగామ రూరల్: ఓ చిన్నారి ఆడుకుంటూ వెళ్లి అనంతలోకాలకు చేరింది. ప్రమాదవశాత్తు గోలెంలో పడి మృతి చెందింది. ఈ ఘటన శనివారం మండలంలోని యశ్వంతాపూర్‌లో జరిగింది. గ్రామానికి చెందిన బోట్ల ఐజాక్ రెండో కూతురు ఖుషి (3) ఇంటి వద్ద ఆడుకుంటూ వెళ్లి ప్రమాదవశాత్తు నీటి గోలెంలో పడింది. నానమ్మ చూసి పక్కవారిని పిలిచి ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే చిన్నారి మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కాగా, తల్లి కూలీకి వెళ్లి సాయంత్రం ఇంటికి రాగా కూతురు చనిపోయిన విషయం తెలియడంతో గుండెలవిసేలా రోదించింది. నీకు అప్పుడే నిండు నూరేళ్లు నిండిపోయాయా బిడ్డా అంటూ కన్నీరుమున్నీరుగా విలపించింది. బిడ్డా.. ఒక్కసారి లే అంటూ కూతురు మృతదేహంపై పడి రోదించిన తీరు ప్రతీ ఒక్కరిని కంటతడి పెట్టించింది.

గిరిజనుల పోరాట ఫలితమే ఫార్మాసిటీ రద్దు

- మాజీ మంత్రి సత్యవతి రాథోడ్

కురవి: లగచర్ల గిరిజనుల పోరాట ఫలితంగానే ఫార్మా సిటీని ప్రభుత్వం రద్దు చేసిందని, గిరిజనులు సీఎం రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా జరిగిన పోరాట విజయమని మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్ అన్నారు. ఈ మేరకు శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం ఆమె మాట్లాడారు. పరిశ్రమలు తీసుకురావడానికి బీఆర్‌ఎస్ వ్యతిరేకం కాదన్నారు. గత ప్రభుత్వంలో సీఎం కేసీఆర్ ప్రజలు, రైతులను మెప్పించి 25 వేల ఎకరాల భూములు తీసుకున్నారని వెల్లడించారు. సొంత నియోజకవర్గంలో వెయ్యి ఎకరాల భూమిని రైతులను ఒప్పించి తీసుకోలేని అసమర్థ సీఎం రేవంత్‌రెడ్డి అని విమర్శించారు. మాజీ ఎమ్మెల్యేను అరెస్టు చేశారని, కలెక్టర్‌ను చంపేందుకు యత్నించారని బీఆర్‌ఎస్ నాయకులను బద్నాం చేస్తున్నారని మండిపడ్డారు. సమావేశంలో ఐలి నరహరి, బాదె నాగయ్య, బోడ శ్రీను, గుగులోత్ నెహ్రూనాయక్, అల్లూరి కిశోర్‌వర్మ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ మంత్రి సత్యవతిరాథోడ్



యూనివర్సిటీపై ప్రత్యేక దృష్టి

- అభివృద్ధి పనులు చేపట్టనున్నాం
- డిసెంబర్ 23న మరోసారి సమావేశమవుదాం
- వరంగల్ ఎంపీ కడియం కావ్య

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించామని వరంగల్ ఎంపీ కడియం కావ్య అన్నారు. శనివారం వరంగల్ పశ్చిమ, వర్ధన్నపేట, పరకాల ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, కేఆర్. నాగరాజు, రేవూరి ప్రకాశ్‌రెడ్డితో కలిసి కాకతీయ కాకతీయ యూనిర్సిటీలోని గెస్ట్ హౌస్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. అంతకుముందు కాకతీయ యూనివర్సిటీలో అనేక సదుపాయాల కల్పన, అభివృద్ధి కోసం ఏయే సమస్యలున్నాయనే అంశంపై పాలకమండలితో చర్చించినట్లు తెలిపారు. సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషిచేస్తామన్నారు. ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ కాకతీయ యూనివర్సిటీలో భూకబ్జాలకు పాల్పడినవారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. గత ప్రభుత్వం హయాంలో ఎప్పుడైనా ఎంపీలు, ఎమ్మెల్యేలు వర్సిటీకి వచ్చి సమీక్షించారా అని ప్రశ్నించారు. దీక్షా దివస్ అని బీఆర్ఎస్ నేతలు చేయడం శోచనీయమన్నారు. కేసీఆర్ నాడు దొంగ దీక్ష చేశారని ఆరోపించారు. సమావేశంలో కేయూ పాలక మండలి సభ్యుడు డాక్టర్ చిర్ర రాజు, కాంగ్రెస్ నాయకులు అలువాల కార్తీక్, గజ్జెల మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

డిటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్టు సిద్ధం చేయాలి

కాకతీయ యూనివర్సిటీ అభివృద్ధి పనులకు సంబంధించి డిటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టును సమర్పించాలని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, వరంగల్ పశ్చిమ, వర్ధన్నపేట, పరకాల ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, కేఆర్.నాగరాజు, రేవూరి ప్రకాశ్‌రెడ్డి సూచించారు. శనివారం వారు అకడమిక్ కమిటీ హాల్‌లో వీసీ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ పి.మల్లారెడ్డి, పాలక మండలి సభ్యులు, డీన్లు, ప్రిన్సిపాళ్లు, ఇతర అధికారులతో సమావేశం నిర్వహించారు. యూనివర్సిటీ అభివృద్ధిపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అధికారులు వివరించారు. బోధన, బోధనేతర సిబ్బంది, మౌలిక, హాస్టల్ వసతులు, ఇతర సదుపాయాలు తెలిపారు. యూనివర్సిటీకి రావాల్సిన ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలు ఎన్ని ఉన్నాయో తెలియజేశారు. డిసెంబర్ 23న మరోసారి సమావేశం నిర్వహించి సమీక్షించుకుందామని నిర్ణయించారు. విశ్వవిద్యాలయం అభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి సుముఖంగా ఉన్నట్లు ఎంపీ, ఎమ్మెల్యేలు తెలిపారు. అంతకుముందు కామన్‌మెస్‌ను ఎంపీ, ఎమ్మెల్యేలు సందర్శించారు. అన్నం, కూరలను పరిశీలించారు. విద్యార్థులతో కూర్చొని భోజనం చేశారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.



పాలకమండలితో సమావేశమైన ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యేలు, వీసీ, రిజిస్ట్రార్, ఇతర అధికారులు

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

TO-LET

■ 2 BHK, 5 Rooms 11,500/- Sri Sai Colony. Forest Office Subedari, Hanamkonda. Cont: Cell: 9849596557. [W-1264101]

TO-LET COMMERCIAL

■ WGL జూబ్లీయా కాంప్లెక్స్ 3rd ఫ్లోర్‌లో 470 sft + 380 sft రెండు పట్టర్లు విడివిడిగా కానీ మొత్తంగా కానీ బ్యాంక్, చిట్‌ఫండ్స్ ఇవ్వబడును. సెల్: 9866656098, 9866184234 [WA-629]

TO-LET FOR FLAT

■ WGL కరీమాబాద్ (KBR రెసిడెన్సీ) 3BHK ఫ్లాట్ కిరాయికి ఇవ్వబడును. సంప్ర।। 9866656098 [WA-630]

PLOT FOR SALE

■ Registered Plot for Sale 600 Sq.Yds. Waddepalli Filter Bed to Devannapet Road, beside Rly Tracks. Cont: 9666734597, 7997226436. [W-1239944]

PROPERTY FOR SALE

■ కమర్షియల్ హాస్టల్ బిల్డింగ్ 100 మంది కెపాసిటీ కలిగినది అమ్మబడును. నెలకు 80000 Rent వస్తుంది G+1 388 sq yards Opposite వాగ్దేవి ఇంజినీరింగ్ కాలేజీ (Near Mamnur airport) 9701334268 [DA-33153]

SERVICES

■ హౌస్, ప్లాట్, వ్యవసాయ భూములు మార్టిగేజ్ చేసుకొని అమౌంట్ ఇప్పించబడును. సిబిల్ అవసరం లేదు. సెల్: 8341479342. [WA-7546]

FINANCIAL SERVICES

■ సిరి అసోసియేట్స్: హౌసింగ్, మార్టిగేజ్, బిజినెస్, పర్సనల్, ఓపెన్ ప్లాటు, రేకుల ఇల్లు, గూన పెంక ఇల్లు, సిబిల్ లేకున్న రుణాలు ఇప్పించబడును. సంప్ర।। 9440863470. [W-1264033]

సెప్టిక్ ట్యాంక్ క్లీనర్

■ మీ యొక్క సెప్టిక్ ట్యాంక్స్ నిండినవా? నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్పర్ మిషన్ ద్వారా మీ సెప్టిక్ ట్యాంక్స్ క్లీన్ చేయబడును. సంప్ర।। డి.యస్. రావు. సెల్: 9849145043 [W-1264013]

PEST CONTROL

■ చెదలు & బొద్దింకల నివారణ & మీ విలువైన ఇండ్లకు & కొత్తగా నిర్మించే భవనములకు కెమికల్ ట్రీట్‌మెంట్ చేయబడును. వాటర్ ప్రూఫింగ్ సర్వీసెస్ – GHANA SRI. Cell: 9676982085 [W-1239943]

WANTED

■ Wanted Senior Business Development Manager with Hospital experience for a reputed Hospital Cont: 9347483888. [WA-14737]

■ Wanted Assistant Doctors, Accountants, Front Office, Executive, Insurance Executives, Lift Boys for a reputed Hospital Cont: 9949499959, 7337222112. [WA-14738]

■ Next VV Marketers Private Limited weirehiring Solar Technicians Qua: ITI/Diploma, Exeperience. Freshers also can apply. Cont: 9618290901. [WA-14739]

■ సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. మహేంద్ర ట్రాక్టర్స్ (KSB ట్రాక్టర్స్) నందు హన్మకొండ, వరంగల్, ములుగు, భూపాలపల్లి జిల్లాలోని అన్ని మండలాలలో పనిచేయుటకు. అర్హత: 10th+ జీతం: 8000-10000/- + TA + DA+ Incentives. సంప్ర।। 9100016385, 9885246699. [WA-6535]

■ WANTED Off. Executive / Accountant (Inter/Deg. 0-2yrs Exp, Sal:8K-12K), Mktg / Sales Executives (Inter / Deg, FMCG, Organic Oils / Food Product Related Exp 0-2yrs, 10K-15K), Production Operaters / Helpers (8K-10K, 10th,Inter,ITI - P/F) Cont: Ind.park, Rampur, HNK. 9919911016. veghannaturals@gmail.com [WA-6534]

■ HNK ఆప్టికల్ షాపులో పని చేయుటకు ఉత్సాహవంతులైన సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. జీతం: 10000 నుండి 15000 వరకు. Reddy Opticals. Prop: అన్వేష్ రెడ్డి, Cell: 9652626526. [WA-626]

■ హరేకృష్ణ హోంకేర్‌లో వృద్ధులను పేషెంట్లను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి ఫుడ్ జీ: 18K. Ph: 9640258899, 9640468899. [SCA24000705]

■ షిరిడి సాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్‌లో లేడీ సూపర్ వైజర్స్, నర్సులు, కాంపౌండర్స్, ఆయాలు, భార్యాభర్తలు కావలెను. 9391036931, 9246585901 [HA-14774]

■ శ్రీనివాస గ్రూపు, (నాగోల్, హైదరాబాద్) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులకు/పేషంట్ల సేవకు, వంట/ ఇంటిపని, బేబీకేర్ కొరకు 10th ఆపైన చదివిన 20-30 సం. వయస్సు గల M/F వర్కర్లు కావలెను. భో+వ+జీ: 18-22000/- ఏజెంట్లకు 5 వేలు కమీషన్ ✆ 99636 91122, 92814 65315 [B-1172528]

■ రామకృష్ణ ఓల్డేజ్ హోం (విజయవాడ బ్రాంచ్) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులు / పేషంట్ల సేవక వంట/ ఇంటిపని, బేబీకేర్ కొరకు M/F వర్కర్స్, భో+ వసతి +జీతం: 15-18000/- ఏజెంట్లకు 5 వేలు కమీషన్ ✆ 95420 47788, 92814 52843 [B-1172526]

■ రామకృష్ణ ఓల్డేజ్ హోం (హైదరాబాద్ బ్రాంచ్) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులు / పేషంట్ల సేవక వంట/ ఇంటిపని, బేబీకేర్ కొరకు M/F వర్కర్స్, భో+ వసతి +జీతం: 16-18000/- ఏజెంట్లకు 5 వేలు కమీషన్ ✆ 91332 71122, 95534 61177 [B-1172531]

FINANCIAL SERVICES

■ బాలాజీ లోన్స్ తక్కువ వడ్డీకే చేయబడును. బిజినెస్, మార్టిగేజ్, హోమ్, టేకోవర్ లోన్స్, ప్లాట్ లోన్ ఇవ్వబడును. I.T. రిటన్స్, G.S.T, పాస్‌పోర్ట్. కాకతీయ థియేటర్ దగ్గర, వరంగల్. 85228 25358. [M-1185439]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన రూ।। 260/- అదనపు లైను రూ।। 60/- మాత్రమే 5% GST అదనము

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి
హన్మకొండ : 9010144453
వరంగల్ : 9705748198
నర్సంపేట : 9553955722
జనగామ : 9951602871
మహబూబాబాద్ : 9010144453
పరకాల : 9010299096
జయశంకర్ భూపాలపల్లి : 9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

'కంగారో'లో బామ్మ, తాతయ్యల సందడి



గ్రాండ్ పేరెంట్స్ డే కార్యక్రమంలో ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి, పక్కన సాక్షి మీడియా గ్రూప్ డైరెక్టర్ కేఆర్‌పీ రెడ్డి తదితరులు

హన్మకొండ అర్బన్: హనుమకొండ బాలసముద్రంలోని కంగారో కిడ్స్ ఇంటర్నేషనల్ ప్రీ స్కూల్‌లో శనివారం గ్రాండ్ పేరెంట్స్‌డే కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఇంటిపట్టున ఉంటూ బోరుగా ఫీలయ్యే బామ్మలు, అమ్మమ్మలు, తాతయ్యలకు కాస్త ఆటవిడుపు దొరికింది. తమ మనుమలు.. మనుమరాళ్లతో సరదాగా గడిపారు. తోటి పెద్దలతో మాటా ముచ్చట్లు చెప్పుకున్నారు. పెద్దల కోసం ప్రత్యేకంగా నిర్వహించిన ఆటలు..పాటల్లో ఉత్సాహంగా పాల్గొని కాస్త రిలాక్స్ అయ్యారు. కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, నీలిమ దంపతులు, సాక్షి మీడియా గ్రూప్ డైరెక్టర్ కేఆర్‌పీ రెడ్డి, కిరణ్, ఉమ, శ్రీకాంత్‌రెడ్డి, స్కూల్ ఇన్‌చార్జ్ నిహారిక పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఒత్తిడి దూరం

- వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్. నాగరాజు
- జాతీయస్థాయి ఓపెన్ మెన్స్ టెన్నిస్ పోటీలు షురూ



టాస్‌వేసి క్రీడలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నాగరాజు

వరంగల్ స్పోర్ట్స్: క్రీడలతో శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఒత్తిడి దూరమవుతుందని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్. నాగరాజు అన్నారు. హనుమకొండ సుబేదారిలోని వరంగల్‌క్లబ్‌లో శనివారం జాతీయస్థాయి ఓపెన్ మెన్స్ టెన్నిస్ చాంపియన్‌షిప్ ప్రారంభమైంది. ఎమ్మెల్యే నాగరాజు ముఖ్య అతిథిగా హాజరై టాస్ వేసి ఈ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరంగల్ వేదికగా జాతీయస్థాయి టోర్నమెంట్ ద్వారా దేశం నలుమూలల నుంచి వస్తున్న క్రీడాకారులకు ఆతిథ్యం ఇవ్వడం అభినందనీయమన్నారు. వరంగల్ టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ ఆత్మీయ స్నేహితుడు శ్రీనివాస్‌గౌడ్ స్మారకార్థం ఈ టోర్నమెంట్ నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. ఈ పోటీలు ఈ నెల 7వ తేదీ వరకు కొనసాగుతాయని, గెలుపొందిన జట్టుకు రూ.2.5 లక్షల నగదు పురస్కారం అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వరంగల్ క్లబ్ సెక్రటరీ రవీందర్‌రెడ్డి, వరంగల్ జిల్లా షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ రమేశ్‌కుమార్, టెన్నిస్ అసోసియేషన్ కార్యదర్శి మనోహర్‌రెడ్డి, ఉపాధ్యక్షులు ఎల్లా మురుగన్, రాజేశ్వర్‌రావు, ప్రవీణ్‌రెడ్డి, ప్రభాకర్‌రావు, జాయింట్ సెక్రటరీ కన్నారెడ్డి, పురుషోత్తంరెడ్డి, గోపాల్‌రావు, కార్యవర్గ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ కృషితోనే రైల్వే కోచ్ ఫ్యాక్టరీ

- మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్



ప్రెస్‌మీట్‌లో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వినయ్‌భాస్కర్

కాజీపేట రూరల్: నాటి టీఆర్‌ఎస్ (బీఆర్‌ఎస్) పార్టీ కృషి వల్లనే ఉమ్మడి జిల్లా ప్రజల 40 ఏళ్ల రైల్వే కోచ్ ఫ్యాక్టరీ కల సాకారమైందని ఆ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. కాజీపేట రైల్వే స్టేషన్ ఎదుట శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నాడు తెలంగాణ ఉద్యమ సమయంలో శ్రీకృష్ణ కమిటీకి రైల్వే కోచ్‌ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలని వినతి పత్రాలు ఇచ్చినట్లు, మాజీ సీఎం కేసీఆర్, పార్లమెంట్ సభ్యులు తామంతా కలిసి విభజన చట్టంలో కోచ్ ఫ్యాక్టరీ, ట్రైబల్ యూనివర్సిటీ, బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలని ఒత్తిడి చేశామని తెలిపారు. 1970–80 దశకంలో సీపీఐ, సీపీఎం, కమ్యూనిస్ట్ నాయకులైన భగవాన్‌దాస్, కాళిదాస్, రైల్వే ఉద్యోగులు, ఈప్రాంతవాసులు కోచ్ ఫ్యాక్టరీ కోసం పోరాడినట్లు గుర్తు చేశారు. అనంతరం కాజీపేట చౌరస్తాలో బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు సంకు నర్సింగరావు, ఇండ్ల నాగేశ్వర్‌రావు, మాజీ కార్పొరేటర్ జోరిక రమేశ్, నార్లగిరి రమేశ్, గబ్బెట శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత

- తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నగేశ్ భీమపాక
- ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఏఎల్) రాష్ట్ర రెండో మహాసభలు



మాట్లాడుతున్న తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నగేశ్ భీమపాక

నయీంనగర్: భారత రాజ్యాంగం ప్రపంచంలోనే అత్యంత పటిష్టమైందని, రాజ్యాంగ పరిరక్షణ అందరి సమిష్టి బాధ్యతని తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నగేశ్ భీమపాక అన్నారు. శనివారం హనుమకొండ హరిత హోటల్‌లో ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఏఎల్) రాష్ట్ర రెండో మహాసభలు ప్రారంభమయ్యాయి. తొలుత మహాసభల ప్రాంగణంలో ఐఏఎల్ రాష్ట్ర అధ్యక్షుడు పొట్ల మాధవరావు ఐఏఎల్ పతాకావిష్కరణ చేశారు. రాష్ట్ర మహాసభలకు ఐఏఎల్ జాతీయ ప్రధాన కార్యదర్శి బొమ్మగాని ప్రభాకర్ అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నగేశ్ భీమపాక హాజరయ్యారు. ఈ సందర్భంగా 'భారత రాజ్యాంగం, ఉద్దేశాలు' అనే అంశంపై జస్టిస్ నగేశ్ భీమపాక మాట్లాడారు. ఎన్నో పోరాటాలు, త్యాగాల ఫలితంగా మనకు స్వేచ్ఛ, స్వాతంత్ర్యం సిద్ధించాయన్నారు. ఎంతో మంది మహానుభావులు దేశాన్ని, రాజ్యాంగాన్ని ముందుకు నడిపించారన్నారు. రాజ్యాంగం 75 ఏళ్లు గడిచినా పటిష్టంగా ఉందన్నారు. రాజ్యాంగం అములు లో కొన్ని వైఫల్యాలు ఉన్నప్పటికీ మెజారిటీ ప్రజల హక్కులను కాపాడుతోందన్నారు. తెలంగాణ బార్ కౌన్సిల్ చైర్మన్ ఏ.నరసింహా రెడ్డి మాట్లాడుతూ దేశంలో ఐఏఎల్ ప్రతిష్టాత్మక సంస్థ అని, ఎంతోమంది పోరాటాల ఫలితంగా ఏర్పడిందన్నారు. ఈ మహాసభల్లో న్యాయవాదుల సమస్యలపై చర్చించి తమ దృష్టికి తీసుకొస్తే వాటి పరిష్కారానికి బార్ కౌన్సిల్ కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఇండియన్ లాయర్స్ యూనియన్ (ఐలు) రాష్ట్ర అధ్యక్షుడు కొల్లి సత్యనారాయణ, ఐఏఎల్ జాతీయ ప్రధాన కార్యదర్శి సీహెచ్ మురళీధర, రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు దుస్సా జనార్దన్, ఐఏఎల్ నాయకులు ఏవీ. కృష్ణారావు, బొమ్మగాని శ్రీనివాస్, ఉదయ్ భాస్కర్, భీమనాథం శ్రీనివాస్, కేవీఎల్, హనుమకొండ, వరంగల్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎం.రమేశ్‌బాబు, జీవన్ గౌడ్, నాయకులు ఎం.ఆదిరెడ్డి, జయ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.